


EVENING EDITION
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
సోమవారం
17-11-2025
పేజీలు: 02



iBOMMA రవి దొరికిపోయింది
## భార్య వల్ల కాదు!

iBOMMA నిర్వాహకుడు రవిని హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అయితే భార్యతో విడాకులు తీసుకునేందుకు వచ్చి పోలీసులకు దొరికిపోయాడనే ప్రచారం జరిగింది. కానీ ఇందులో నిజం లేదని తెలుస్తోంది. అతడికి ఐదేళ్ల క్రితమే విడాకులైనట్లు సమాచారం. ఇటీవల ఓ బెట్టింగ్ యాప్ నుంచి రవికి చెల్లింపుల ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేయగా ఐపీ అడ్రస్ దొరికింది. అది మూసాపేట్‌లోని అపార్ట్‌మెంట్స్ అని గుర్తించి నిఘా ఉంచారు. 2 రోజుల క్రితం అతడు ఫ్రాన్స్ నుంచి తిరిగి రాగానే అరెస్టు చేశారు.



## ఏపీలో డ్వాక్రా మహిళలకు రూ.4లక్షల సాయం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించేందుకు కృషి చేస్తోంది. తాజాగా, కొర్రమీను చేపల పెంపకం ద్వారా వారి ఆదాయాన్ని పెంచేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ పథకం ద్వారా తక్కువ ఖర్చుతో, ఏడాదికి రూ.3 నుంచి 4 లక్షల వరకు నికర ఆదాయం పొందవచ్చని అంచనా. బ్యాంకుల ద్వారా రుణాలు అందించి, స్వయం సహాయక సంఘాలలోని మహిళలు ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఈ కొత్త ఆదాయ మార్గం డ్వాక్రా మహిళలకు అండగా నిలుస్తుందని అధికారులు ఆశిస్తున్నారు.



# ఘోర రోడ్డు ప్రమాదం
## సౌదీలో 42 మంది భారతీయులు మృతి

సౌదీ అరేబియాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బస్సు - ట్యాంకర్ ఢీకొట్టుకున్న సంఘటనలో ఏకంగా 42 మంది చనిపోయారు. మృతుల్లో 20 మంది మహిళలు కాగా.. 11 మంది చిన్నారులు ఉన్నారు. వీరంతా మక్కా నుంచి మదీనా వెళ్తున్న భారతీయ యాత్రికులు కావటం గమనార్హం. బదర్-మదీనా మధ్య ముఫరహత్ దగ్గర ఘటన జరిగింది. మృతుల్లో ఎక్కువమంది హైదరాబాద్ వాసులు ఉన్నారు.

మక్కాలో ప్రార్థనలు ముగించుకుని వెళుతూ..

సోమవారం తెల్లవారు జామున యాత్రికులు మక్కాలో ప్రార్థనలు ముగించుకుని బస్సులో మదీనా వెళుతూ ఉన్నారు. వారు ప్రయాణిస్తున్న బస్సు 1.30 గంటల ప్రాంతంలో డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదం జరిగిన సమయంలో యాత్రికులందరూ నిద్రలో ఉన్నారు. ఎక్కువ మంది నిద్రలోనే ప్రాణాలు విడిచారు. మరికొంతమంది తీవ్రంగా గాయపడ్డారు. ఒకే కుటుంబానికి చెందిన ఒకరికంటే ఎక్కువ మంది ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోవటం విషాదకరం. స్థానిక మీడియా కథనాల ప్రకారం మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. సంఘటనకు సంబంధించిన సమాచారం అందుకున్న సౌదీ సహాయక బృందాలు హుటాహుటిన ఘటనా స్థలం దగ్గరకు చేరుకున్నాయి. సహాయక చర్యలు చేపట్టాయి. గాయపడ్డ వారిని వెంటనే దగ్గరలోని ఆస్పత్రికి తరలించాయి. ఇండియన్ ఎంబసీ ఈ ఘటనపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. హజ్ కమిటీ, ఇండియన్ ఎంబసీ బాధిత కుటుంబాలకు సహాయం అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాయి.

సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి..

సౌదీ అరేబియాలో భారతీయ యాత్రికులతో ఉన్న బస్సు ఘోర ప్రమాదానికి గురవడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితులకు సంబంధించి సీఎం పూర్తి వివరాలు తెలుసుకోవాలని సీఎస్, డీజీపీ ని అదేశించారు. తెలంగాణ కు చెందిన వారు ఎంత మంది ఉన్నారని ఆరా తీశారు. కేంద్ర విదేశాంగ శాఖ, సౌదీ ఎంబసీ అధికారులతో మాట్లాడాలని సూచించారు. అవసరమైన సహాయ చర్యలకు రంగంలోకి దిగాలని అదేశించారు. సీఎం అదేశాలతో సీఎస్ రామకృష్ణారావు ఢిల్లీ లో ఉన్న రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ ను అప్రమత్తం చేశారు. ప్రమాదంలో మన రాష్ట్రానికి చెందిన వారు ఎంత మంది ఉన్నారనే వివరాలు సేకరించి వెంటనే అందించాలని అదేశించారు. అంతేకాకుండా సచివాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. +91 79979 59754, +91 99129 19545 ఈ నెంబర్లకు ఫోన్ చేయాలని అధికారులు సూచించారు. ఒక ప్రైవేట్ టూర్స్ అండ్ ట్రావెల్స్ నుండి వీళ్లంతా దుబాయ్ వెళ్లినట్లు సమాచారం.. ఈ ట్రావెల్స్ నుండి 16 మంది వెళ్లినట్లు తెలుస్తోంది. మరికొంత మంది మరో ట్రావెల్స్ ద్వారా ఉమ్రా యాత్రకు వెళ్లారు. మక్కా నుంచి మదీనాకు వెళ్లే ఈ ఉమ్రా యాత్రకు వెళ్లిన వారి వివరాలపై మరికాసేపట్లో పూర్తి స్పష్టత రానుంది.



## తెలంగాణలో కిడ్నీ రాకెట్ స్కామ్‌పై సీఐడీ కృషి

అన్నమయ్య జిల్లాలోని మదనపల్లి గ్లోబల్ ఆసుపత్రిలో సంచలనంగా వెలుగులోకి వచ్చిన కిడ్నీ రాకెట్ కేసులో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఆరుగురు ప్రధాన నిందితులను మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి, 15 రోజుల రిమాండ్ ఇచ్చారు. వీరిని అనంతరం సబ్ జైలుకు తరలించారు. ఈ రోజు (ఆదివారం) మదనపల్లి ఏరియా ఆసుపత్రిలో వైద్య పరీక్షలు పూర్తయిన తరువాత మేజిస్ట్రేట్ వద్దకు తీసుకెళ్లారు. కేసులో ఆంజనేయులు, బాల రంగడు, మహారాజ్, పిల్లి పద్మా, సత్య, సూరిబాబు ప్రధాన నిందితులుగా ఉన్నారు.ఈ ఘటన మంగళవారం (నవంబర్ 11) మదనపల్లిలో వెలుగులోకి వచ్చింది. మహిళలను విశాఖ నుండి మదనపల్లికి తీసుకురావడం, కిడ్నీలను అసలైన అనుమతుల్లేకుండా తొలగించడం తెలిసిన సందర్భంగా సంచలనాస్పదం అయ్యింది.

## పెళ్లి చేసుకుని తప్పటడుగు వేశాను
### జ్యోతి



నటి జ్యోతి బోల్డ్ క్యారెక్టర్ ఆర్టిస్టుగా పేరు తెచ్చుకుంది. ఆ మధ్య తెలుగు బిగ్‌బాస్ మొదటి సీజన్‌లోనూ పాల్గొంది. ఐతే, తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో జ్యోతి తన కెరీర్ గురించి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. నేను పుట్టింది ఒరిస్సాలో. కానీ, విశాఖపట్నంలోనే పెరిగాను. 24 ఏళ్లుగా హైదరాబాద్‌లో ఉంటున్నాను. మొదట్లో హీరోయిన్ అవుదామనే ట్రై చేశాను. కానీ, నాకు వ్యాంప్ తరహా పాత్రలే వచ్చాయి. నిజానికి ఇప్పటికీ ఐటమ్ సాంగ్స్ చేయమని అడుగుతున్నారు' అని జ్యోతి తెలిపారు. జ్యోతి తన పెళ్లి గురించి మాట్లాడుతూ.. 'నా కెరీర్ లో పెళ్లి చేసుకుని తప్పు చేశాను.



అంధుల టీ20 ప్రపంచకప్‌లో
## పాకిస్థాన్‌పై భారత్ ఘన విజయం



అంధుల మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టు తన జైత్రయాత్రను కొనసాగించింది. కొలంబోలోని బీఓఐ గ్రౌండ్స్‌లో తమ చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో భారత్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి ఘన విజయం సాధించింది. అద్భుతమైన ఫీల్డింగ్, ఆ తర్వాత బ్యాటింగ్‌లో విధ్వంసకర ప్రదర్శనతో పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. ఈ విజయంతో టోర్నీలో వరుసగా ఐదో గెలుపును నమోదు చేసుకుని, అజేయంగా నిలిచింది. ఇప్పటికే సెమీఫైనల్‌లో తన స్థానాన్ని ఖాయం చేసుకున్న భారత్, ఈ గెలుపుతో మరింత ఆత్మవిశ్వాసాన్ని పెంచుకుంది.ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 135 పరుగులు చేసింది. భారత బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌కు పాక్ టాప్ ఆర్డర్ కుప్పకూలింది. కేవలం 23 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో బీ3 కేటగిరీ బ్యాటర్ మెహ్రీన్ అలీ (57 బంతుల్లో 66) ఒంటరి పోరాటం చేసింది. ఆమెకు మరో బీ3 బ్యాటర్ బుష్రా అష్రఫ్ (38 బంతుల్లో 44) చక్కటి సహకారం అందించడంతో పాకిస్థాన్ గౌరవప్రదమైన స్కోరు చేయగలిగింది. అయితే, ఈ మ్యాచ్‌లో భారత ఫీల్డింగ్ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మన ఫీల్డర్లు కళ్లు చెదిరే రీతిలో ఏకంగా ఏడుగురు పాక్ బ్యాటర్లను రనౌట్ చేసి పాకిస్థాన్ పతనాన్ని శాసించారు. భారత బౌలర్లలో ఫులా సరెన్, అను కుమారి, గంగా కదం క్రమశిక్షణతో బౌలింగ్ చేసి పాక్ బ్యాటర్లపై ఒత్తిడి పెంచారు.అనంతరం 136 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టు ఏ దశలోనూ తడబడలేదు. ఓపెనర్లు ఆరంభం నుంచే దూకుడుగా ఆడారు.

20న బీహార్‌లో కొలువుదీరనున్న కొత్త ప్రభుత్వం..
## హాజరుకానున్న ప్రధాని మోదీ



బీహార్‌లో ఎన్డీఏ కూటమి 202 సీట్లతో ఘన విజయం సాధించింది. దీంతో ముఖ్యమంత్రిగా నితీశ్ కుమార్ 10వ సారి పగ్గాలు చేపట్టనున్నారు. ఈ నెల 20న (గురువారం) కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. సీఎంగా నితీశ్ కుమారు, పలువురు మంత్రులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి పాట్నాలోని చారిత్రక గాంధీ మైదాన్ వేదిక కానుంది. ముఖ్య అతిథిగా ప్రధాని మోదీ హాజరుకానున్నారు. కాగా, సోమవారం ఉదయం 11.30 గంటలకు ప్రస్తుత మంత్రిమండలి చివరిసారిగా భేటీ కానుంది. సీఎం నితీశ్ కుమార్ అధ్యక్షతన జరుగనున్న మంత్రివర్గ సమావేశంలో అసెంబ్లీ రద్దుకు తీర్మాణం చేయనున్నారు. అనంతరం నితీశ్ కుమార్ తన సీఎం పదవికి రాజీనామా చేయనున్నారు. రాజీనామా పత్రాన్ని గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌కు అందించనున్నట్లు జేడీయూ సీనియర్ వెల్లడించారు. బీహార్ అసెంబ్లీలోని మొత్తం 243 స్థానాలకు గాను 202 సీట్లలో ఎన్డీఏ కూటమి అఖండ విజయం సాధించింది. ఇందులో బీజేపీకి 89, నితీశ్ కుమార్‌కు చెందిన జేడీ(యూ) కు 85, కూటమి పార్టీలైన ఎల్‌జేపీ (రామ్ విలాస్)కి 19, హెచ్‌ఏఎం 5 , ఆర్‌ఎల్‌ఎస్‌పీ 4 సీట్లలో గెలుపొందాయి. దీంతో బీహార్‌లో మరోసారి ఎన్డీఏ కూటమి అధికారం చేపట్టడానికి సిద్ధమైంది.

## టాక్సిక్ పైనే కియారా ఆశలు!

బాలీవుడ్ నటి కియారా అద్వానీ, 'గేమ్ ఛేంజర్', 'వార్2' చిత్రాల ఫ్లాప్ తర్వాత, యశ్ హీరోగా నటిస్తున్న కన్నడ చిత్రం 'టాక్సిక్' పైనే తన ఆశలన్నీ పెట్టుకున్నట్లు సిని వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈ చిత్రం ద్వారా ఆమె కన్నడ చిత్రసీమలోకి అడుగుపెడుతోంది. లేడీ డైరెక్టర్ గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది మార్చి 19న విడుదల కానుంది. గ్లోబల్ మార్కెట్ ను లక్ష్యంగా చేసుకుని ఈ సినిమాను ఇంగ్లీషులోనూ తెరకెక్కిస్తున్నారు.

## రామోజీ ఫిల్మ్ సిటీ తెలంగాణకు నాలుగో అద్భుతం అన్న సీఎం రేవంత్ రెడ్డి



రామోజీ గ్రూప్ సంస్థల వ్యవస్థాపకులు రామోజీరావు 89వ జయంతిని పురస్కరించుకుని రామోజీ ఎక్సలెన్స్ అవార్డులు-2025 ప్రదానోత్సవం హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. రామోజీ ఫిల్మ్ సిటీని రాష్ట్రానికి 'నాలుగో అద్భుతం'గా అభివర్ణిస్తూ ప్రశంసలు కురిపించారు. ఈ వేడుకలో రామోజీరావు దార్శనికతను, ఆయన సేవలను ప్రముఖులు స్మరించుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ హాజరయ్యారు. ఆయనతో పాటు తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ మహేశ్ వర్మ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, రామ్ మోహన్ నాయుడు, మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. రమణ తదితర రాజకీయ, పారిశ్రామిక, సినీ రంగ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, రామోజీ గ్రూప్ సంస్థలు తెలంగాణకు గర్వకారణమని కొనియాడారు. "హైదరాబాద్‌కు చారిత్రకంగా చార్మినార్, గోల్కొండ కోట వంటి అద్భుతాలు ఉన్నాయి. ఆధునిక యుగంలో హైటెక్ సిటీ మరో అద్భుతంగా నిలిచింది. ఇప్పుడు వాటి సరసన రామోజీ ఫిల్మ్ సిటీ నాలుగో అద్భుతంగా చేరింది. ఇది తెలంగాణకు దక్కిన గొప్ప ఆస్తి" అని ఆయన పేర్కొన్నారు. రామోజీ స్ఫూర్తిని కొనసాగిస్తూ ఈ అవార్డులను ఏర్పాటు చేసిన వారి కుటుంబ సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# ఫ్యాన్సీ నంబర్లు నచ్చింది కావాలంటే రూ.1.50 లక్షలు చెల్లించాల్సిందే!

కొత్త వాహనాలు కొనుగోలు చేసి వాటికి ఫ్యాన్సీ నంబర్లను రిజర్వ్ చేసుకోవాలనుకునే వారికి తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ భారీ షాక్ ఇచ్చింది. ప్రత్యేక నంబర్ల రిజర్వేషన్ రుసుములను ఏకంగా మూడు రెట్లు వరకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 'మోటారు వెహికిల్స్ రూల్స్-1989'లోని నిబంధన 81కి సవరణ చేస్తూ రవాణా శాఖ శనివారం జీవో 77ను జారీ చేసింది. గతంలో జారీ చేసిన ప్రిలిమినరీ నోటిఫికేషన్‌పై ఎటువంటి అభ్యంతరాలు రాకపోవడంతో.. ప్రభుత్వం తుది నోటిఫికేషన్‌ను ప్రకటించింది. ఇందులో ప్రత్యేక నంబర్లకు చెల్లించాల్సిన కొత్త రేట్లను స్పష్టంగా వెల్లడించింది. ఈ పెరిగిన ధరలు వెంటనే అమల్లోకి వస్తాయని అధికారులు తెలిపారు. ముఖ్యమైన, అత్యధిక డిమాండ్ ఉన్న ఫ్యాన్సీ నంబర్ల రిజర్వేషన్ ఫీజులు భారీగా పెరిగాయి. 9999 నెంబర్‌కు గతంలో రూ. 50 వేలు ఉండగా.. ఇప్పుడు రూ. 1.50 లక్షలకు



పెంచారు. 0009.0001 నెంబర్‌కు గతంలో రూ. 50వేలు ఉండగా.. ప్రస్తుతం రూ. లక్షకు పెంచారు. 6666 నెంబర్‌కు గతంలో రూ. 30 వేలు ఉండగా.. ప్రస్తుతం రూ.లక్షకు పెంచారు.

99, 999, 3333, 4444, 5555, 7777లకు: రూ.50 వేలు

5, 6, 7, 123, 333, 1234, 2727, 3456, 6789, 8888 నంబర్లకు: రూ.40 వేలు

3, 111, 234, 5678, 1818, 1999 నంబర్లకు: రూ.30 వేలు

2, 4, 8, 77, 786, 1233, 4567, 4777 వంటి నంబర్లకు: రూ.20 వేలు

ఇతర నంబర్లకు(కార్లు,, ఇతర వాహనాలు): రూ.6 వేలు

ఇతర నంబర్లకు(బైకులకు): రూ.3 వేలు

ఈ భారీ పెంపుదల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం గణనీయంగా పెరుగుతుందని అంచనా. ఫ్యాన్సీ నంబర్ల కోసం డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ఈ ధరల పెంపు సరైనదేనని రవాణా శాఖ వర్గాలు చెబుతున్నాయి. ప్రత్యేక నంబర్లకు దరఖాస్తు, వేలం విధానంప్రత్యేక నంబర్లను కేటాయించే విధానంలో ఎటువంటి మార్పు లేదు, కానీ ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్‌లో పారదర్శకంగా జరుగుతుందిని అధికారులు వెల్లడించారు. వాహన యజమానులు ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులను తప్పనిసరిగా www. transport.telangana.gov.in అనే అధికారిక పోర్టల్ ద్వారానే సమర్పించాలి. ఒకే ఫ్యాన్సీ నంబర్ కోసం ఒకటి కంటే ఎక్కువ దరఖాస్తులు వచ్చిన పక్షంలో, అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు ఆన్‌లైన్ బిడ్డింగ్ (వేలం) నిర్వహిస్తారు. వేలంలో అత్యధిక మొత్తాన్ని చెల్లించడానికి సిద్ధపడిన వారికి ఆ నంబరు కేటాయించబడుతుంది. ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో పాల్గొని, నంబరు గెలవని వారికి వారు చెల్లించిన రిజర్వేషన్ రుసుములో 10 శాతం మినహాయింపు ఉంటుంది. మిగిలిన మొత్తం రీఫండ్ చేయబడుతుంది. ప్రత్యేక నంబరు కేటాయించిన తర్వాత, వాహన రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. అనంతరం యజమాని 15 రోజుల్లోగా రిజిస్ట్రేషన్ కోసం వాహనాన్ని రవాణా కార్యాలయంలో చూపించాల్సి ఉంటుంది. నిర్దేశించిన 15 రోజుల గడువులోగా వాహనాన్ని చూపించడంలో విఫలమైతే, ప్రత్యేక నంబరు రిజర్వేషన్ రద్దవుతుందని రవాణా శాఖ స్పష్టం చేసింది. చెల్లించిన ఫీజు తిరిగి చెల్లించబడదు.




## బాలికలు స్నానం చేస్తుండగా వీడియోలు.. హాస్టల్ వార్డెన్ సస్పెన్షన్

ఆశ్రమ పాఠశాలలో బాలికలు స్నానం చేస్తుండగా వీడియోలు తీసిన వార్డెన్ సస్పెన్షన్ కు గురయ్యారు. ఆదిలాబాద్ జిల్లా బేల మండలం చాంద్ పల్లి ఆశ్రమ పాఠశాలలో వార్డెన్ గా విధులు నిర్వర్తిస్తున్న జి.ఆనందరావు ఈ దారుణానికి పాల్పడ్డాడు. ఇటీవల ఆ పాఠశాలను సందర్శించిన షీ టీమ్ అవగాహన కార్యక్రమం సందర్భంగా బాలికలు ఈ విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లారు. పూర్తి వివరాలు సేకరించిన పోలీసులు.. బేల పీఎస్ లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఆనందరావుపై పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు.. శనివారం రిమాండ్ కు తరలించారు.



## వీధి కుక్కల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు

ఏపీలో వీధి కుక్కల బెడదను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు, నవంబర్ 7 నాటి తీర్పునకు అనుగుణంగా, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ అధికారులు అన్ని మున్సిపల్ కమిషనర్లకు మార్గదర్శకాలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కుక్కలకు సంతాన నిరోధకత కల్పించారు. రేబిస్ సోకిన కుక్కలను గుర్తించి ప్రత్యేక షెల్టర్లలో ఉంచాలని, ఏబీసీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు.



## రూ.10 వేలు కడితే చాలు.. 2 ఎకరాల 10 గుంటల వ్యవసాయ భూమి

ఇటీవల కాలంలో ఆస్తుల విక్రయాలలో లక్కీ డ్రా ధోరణి ఊపందుకుంటోంది. ఫ్లాట్లు, ప్లాట్లు, చివరికి వ్యవసాయ భూములను కూడా విక్రయించడానికి చాలా మంది యజమానులు ఈ వినూత్న మార్గాన్ని అనుసరిస్తున్నారు. చిన్న పెట్టుబడితో పెద్ద ఆస్తిని సొంతం చేసుకునే అవకాశం ఉండటంతో.. ప్రజల నుంచి ఈ ప్రకటనలకు అనూహ్య స్పందన లభిస్తోంది. ఈ ట్రెండ్‌ను అనుసరిస్తూ.. తాజాగా కామారెడ్డి జిల్లాకు చెందిన ఓ రైతు తన భూమిని అమ్మడానికి ఇదే లక్కీ డ్రా పద్ధతిని ప్రకటించారు. కామారెడ్డి జిల్లా, రాజంపేట మండలం, బస్వాన్నపల్లి గ్రామానికి చెందిన రైతు రాజు సోషల్ మీడియా వేదికగా ఈ సంచలనాత్మక ప్రకటన చేశారు. ఆయన తన 2 ఎకరాల 10 గుంటల వ్యవసాయ భూమిని విక్రయించేందుకు ఈ డ్రాను తెరపైకి తెచ్చారు. ఒక్కో టికెట్‌ను రూ. 10,000 చొప్పున మొత్తం 500 టికెట్లు విక్రయించాలని రైతు నిర్ణయించారు. 500 టికెట్ల అమ్మకం పూర్తయితే రైతుకు మొత్తం రూ. 50 లక్షలు సమకూరుతాయి. స్థానిక రియల్ ఎస్టేట్ నిపుణుల అంచనా ప్రకారం.. ఆ భూమి ప్రస్తుత మార్కెట్ విలువ సుమారు రూ. 30 లక్షల నుంచి రూ. 35 లక్షలు మాత్రమే. అంటే.. ఈ డ్రా ద్వారా రైతు మార్కెట్ విలువ కంటే దాదాపు రూ. 15 నుంచి రూ. 20 లక్షల వరకు అదనంగా రాబట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ తరహా లక్కీ డ్రాలు విజయవంతం కావడం తెలుగు రాష్ట్రాల్లో ఇదే మొదటిసారి కాదు. గతంలో ప్లాట్లు, ఇళ్లకు ఇలాంటి డ్రాలు నిర్వహించిన యజమానులు తమ ఆస్తులను మార్కెట్ కంటే ఎక్కువ ధరకు అమ్ముకోగలిగారు. ఉదాహరణకు.. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో ఒక వ్యక్తి తన ఇంటి స్థలాన్ని లక్కీ డ్రా విధానం ద్వారా రూ. 16 లక్షల విలువైన ఇంటిని లక్కీ డ్రా ద్వారా విక్రయించాడు. దీనిని సంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ పసిపాప సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. మరో లక్కీ డ్రాలో సూర్యాపేట జిల్లాలోని ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి కూడ తన ప్లాట్ ను విక్రయించేందుకు లక్కీ డ్రా విధానాన్ని అనుసరించాడు. ప్రస్తుతం అతడు కూడా టికెట్స్ ను అమ్మే పనిలో ఉండగా.. డ్రా మాత్రం సంక్రాంతికి తీస్తానన్నాడు. మంచిర్యాల జిల్లాలో ఓ రైతు రూ.10 వేలకే తన 4 ఎకరాల వ్యవసాయ భూమిని లక్కీ డ్రాలో పెట్టేశాడు. ఇలా ఇటీవల కాలంలో ఈ ట్రెండ్ ఎక్కువగా కనిపిస్తోంది. ఇక కామారెడ్డి జిల్లాలోని ఈ రైతు తన డ్రాలో భూమిని గెలుచుకున్న విజేత, రిజిస్ట్రేషన్ మరియు స్టాంపు డ్యూటీ ఖర్చులను స్వయంగా భరించాల్సి ఉంటుందన్న నిబంధన విధించాడు. చిన్న మొత్తంలో పది వేలు చెల్లించి..

దాదాపు 30 లక్షల విలువైన భూమిని పొందే అద్భుతమైన అవకాశం కావడంతో.. సోషల్ మీడియాలో దీనిపై ఆసక్తి పెరుగుతోంది. అయితే.. మొత్తం 500 మంది సభ్యులు ఎప్పుడు చేరతారు..? డ్రా పారదర్శకత ఎలా ఉంటుంది..? ఒకవేళ డ్రా రద్దయితే డబ్బు తిరిగి చెల్లించే విధానం ఏమిటి వంటి అంశాలపై మరింత స్పష్టత అవసరమని కొందరు అభిప్రాయపడుతున్నారు.

అయినప్పటికీ.. రైతు రాజు మాత్రం 2026 సంక్రాంతి లోపు సభ్యుల నమోదు పూర్తి చేసి డ్రా నిర్వహిస్తానని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

చిన్న మొత్తంలో పెట్టుబడితో పెద్ద ఆస్తిని దక్కించుకునే ఈ ప్రయోగం స్థానిక ప్రజలలో చర్చనీయాంశంగా మారింది.




## రవితేజ-సమంత కాంబోలో కొత్త సినిమా!

మాస్ మహారాజ రవితేజప్రస్తుతం కిషోర్ తిరుమల దర్శకత్వంలో 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సినిమాలో నటిస్తున్నారు. ఆ తర్వాత కళ్యాణ్ కృష్ణ, నవీన్ పొలిశెట్టిలతో సినిమాలు చేయనున్నారు. తాజాగా, 'నిన్ను కోరి', 'మజిలీ' వంటి చిత్రాల దర్శకుడు శివ నిర్వాణతో రవితేజ ఒక సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలుస్తోంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా సమంత నటించనున్నట్లు సమాచారం. చాలా కాలం తర్వాత సమంత తెలుగు సినిమాలో నటించడానికి ఒప్పుకున్నట్లు తెలుస్తోంది.

## రాగి గనిలో కుప్పకూలిన వంతెన.. 32 మంది మృతి

ఆఫ్రికా దేశం కాంగోలో ఘోర ప్రమాదం జరిగింది. రాగి గనిలో వంతెన కుప్పకూలింది. దీంతో 32 మంది మృతి చెందారు. కాంగోలోని లువాలాబా ప్రావిన్స్‌లోని కలాండో సైట్‌లో రాగి గని ఉంది. ఈ మైనింగ్ సైట్‌లో వందలమంది కార్మికులు పనిచేస్తున్నారు. ఈ క్రమంలో మైనింగ్ వద్ద కాల్పుల శబ్దం వినిపించడంతో ఇరుకైన వంతెనపై కార్మికులు ఒక్కసారిగా పరుగులు తీశారు. దీంతో అది కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదం ఇప్పటివరకు సుమారు 32 మంది చనిపోయారని మైనింగ్ ఏజెన్సీ తెలిపింది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వెల్లడించింది. కాంగోలో ఈ ఏడాది జరిగిన అతిపెద్ద మైనింగ్ ప్రమాదాల్లో ఒకటిగా నిలిచింది. కాగా, 49 మంది మరణించారని, మరో 20 మంది దవాఖానాలో చికిత్స పొందుతున్నారని, వారి పరిస్థితి విషమంగా ఉందని రాయిటర్స్ వర్గాలు పేర్కొన్నాయి. కాంగోలో మైనింగ్ గని ముఖ్యమైన జీవనాధారం. దాదాపు 15 లక్షల నుంచి 20 లక్షల మంది ఈ గని



ద్వారా ఉపాధి పొందుతున్నారు. పరోక్షంగా లక్షలాది దీని మీద ఆధారపడి బతుకుతున్నారు. అయితే కనీస భద్రతా చర్యలు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఈ ప్రమాదానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



## భాగ్యనగరంలో తృటిలో తప్పిన పెను ప్రమాదం

హైదరాబాద్‌లోని గాంధీ నగర్‌లో సోమవారం TS TS09 GD 1262 నంబర్ గల ఎలక్ట్రిక్ కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. స్థానికులు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది వెంటనే చేరుకుని మంటలను అదుపులోకి తీసుకున్నారు. ట్రాఫిక్ పోలీసులు కూడా సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు, కేవలం వాహనానికి మాత్రమే నష్టం జరిగింది. మంటలు ఎలా చెలరేగాయనే దానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## హైదరాబాద్ బిర్యానీకి ఫిదా అయిన జపాన్ రాయబారి!

భారత్‌లో పర్యటిస్తున్న జపాన్ రాయబారి ఒనో కెయిచి, తెలంగాణలో పర్యటించి హైదరాబాద్ దమ్ బిర్యానీ రుచి చూశారు. బిర్యానీ రుచికి ఆశ్చర్యపోయి, దానిని తెగ పొగిడేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. 'తెలంగాణ పర్యటన సందర్భంగా అసలైన హైదరాబాదీ బిర్యానీని ఆస్వాదించాను. దాని గొప్ప సుగంధ ద్రవ్యాలు, అద్భుత రుచికి ఆశ్చర్యపోయాను. ఈ బిర్యానికి బానిసైపోయాను' అని ఆయన పేర్కొన్నారు.





## గచ్చిబౌలిలో హైడ్రా కూల్చివేతలు

హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. సంధ్య కన్వెన్షన్ సమీపంలో నిర్మాణాలను హైడ్రా సిబ్బంది తొలగించారు. ఫెర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎంప్లాయీస్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లేఅవుట్‌లో అక్రమంగా నిర్మాణాలు చేపట్టినట్లు స్థానికుల నుంచి హైడ్రాకు ఫిర్యాదులు అందాయి. దీంతో సోమవారం ఉదయం అధికారులు చర్యలు చేపట్టారు. అనుమతులు లేని షెడ్‌లు, నిర్మాణాలను భారీ క్రేన్లతో నేలమట్టం చేశారు. భారీ పోలీస్ బందోబస్త్ మధ్య కూల్చివేతలు నిర్వహించారు. గతంలో కూడా ఇక్కడ అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చివేసిన విషయం తెలిసిందే.